


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న మన దునియా మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



సంపుటి : 3 | సంచిక : 220 | ఫిబ్రవరి 23 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## ఆరోగ్యాన్ని మౌనంగా నాశనం చేసే అలవాట్లు

# ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన నిజాలు







మన దునియా, హైదరాబాద్ బ్యూరో ఫిబ్రవరి 22

మనకు తెలియకుండానే మన రోజువారీ అలవాట్లే అనేక రోగాలను పెంచుతున్నాయి. మందులు తీసుకుంటూనే, అదే సమయంలో తప్పు జీవనశైలి కొనసాగిస్తే ఆరోగ్యం మెరుగుపడదు. ఈ వ్యాసంలో సాధారణంగా మనం చేసే కొన్ని అలవాట్లు ఎలా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయో స్పష్టంగా తెలుసుకుందాం.

మధుమేహం రాత్రి ఆలస్యంగా తినడం

రాత్రి ఆలస్యంగా స్నాక్స్, తీపి పదార్థాలు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఇది ఇన్సులిన్‌పై అదనపు భారం పెడుతుంది. దీర్ఘకాలంలో డయాబెటిస్ నియంత్రణ తప్పిపోతుంది. నిద్ర సమయంలో శరీరానికి విశ్రాంతి బదులు జీర్ణక్రియ పనిలో పడుతుంది. ఇది ప్రమాదకరం.

హై బీపీఎక్కువ ఉప్పు

అధిక ఉప్పు తీసుకోవడం శరీరంలో నీటిని నిల్వ చేస్తుంది. దీని వల్ల రక్తపోటు పెరుగుతుంది. హృదయంపై ఒత్తిడి ఎక్కువవుతుంది. స్ట్రోక్, గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ప్యాకెట్ ఫుడ్‌లో ఉప్పు ఎక్కువగా ఉంటుందని చాలామందికి తెలియదు.

మైగ్రేన్‌భోజనం మానేయడం సమయానికి భోజనం చేయకపోవడం వల్ల బ్లడ్ షుగర్ తగ్గుతుంది. ఇది మైగ్రేన్ ట్రిగ్గర్ అవుతుంది. తలనొప్పి తీవ్రత పెరుగుతుంది. శరీరం బలహీనంగా మారుతుంది. రెగ్యులర్ భోజనం చాలా అవసరం.

గుండె సమస్యలువ్యాయామం లేకపోవడం నడక, వ్యాయామం లేకపోతే గుండె కండరాలు బలహీనపడతాయి. కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తప్రసరణ మందగిస్తుంది. గుండె వ్యాధులు నెమ్మదిగా వస్తాయి. రోజుకు కనీసం 30 నిమిషాలు కదలిక అవసరం.ఊబకాయంచక్కెర పానీయాలు కూల్ డ్రింక్స్, ప్యాకెట్ జ్యూసులు ఖాళీ కేలరీలే. ఇవి కొవ్వును పెంచుతాయి. ఆకలి నియంత్రణ పోతుంది. బరువు వేగంగా పెరుగుతుంది. మధుమేహం, గుండె సమస్యలకు ఇది ప్రధాన కారణం.

ఎముకలు బలహీనపడటం (మిగతా 2వ పేజీలో..)

## తెలుగు రాష్ట్రాలకు ప్రతిపక్షాలు కావలెను!

మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 22

"నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి "ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం (మిగతా 2వ పేజీలో..



## అఫ్గానిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు




## దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక!

మన దునియా,న్యూఢిల్లీ:ఫిబ్రవరి 22



దేశంలో డిజిటల్ మోసాలు పెరిగిపోతున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణ కంటే డిజిటల్ మోసాలను కట్టడి చేయటం పోలీసులకు పెద్ద కష్టంగా మారింది. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నా సరే ఎక్కడో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉన్నారు.ఈ క్రమంలో తాజాగా నేడు మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ (మిగతా 2వ పేజీలో..)

మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

# అఫ్గానిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు

మన దునియా,పాక్:ఫిబ్రవరి 23

పాక్ వాయుసేన శనివారం రాత్రి అఫ్గానిస్థాన్‌లో వైమానిక దాడులు నిర్వహించింది. పాక్–అఫ్గాన్ సరిహద్దు వెంబడి పలు ప్రాంతాలపై జరిగిన ఈ దాడుల్లో సుమారు 17 మంది మృతి చెందారు. ఉగ్ర మూకలు దాక్కున్న ప్రాంతాలపై ఈ దాడులు చేశామని పాక్ తెలిపింది.వైమానిక దాడులను పాక్ సమాచార శాఖ మంత్రి అతావుల్లా తరార్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఉగ్రవాదులకు సంబంధించిన ఏడు స్థావరాలపై పాక్ వైమానిక దాడి చేసిందని తెలిపారు. పాక్ తాలిబాన్లు, వారి స్థావరాలను టార్గెట్ చేసుకున్నామని చెప్పారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులపై కూడా పాక్ వైమానిక దాడులు చేసిందని అన్నారు.అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్లు అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పాక్‌తో పొసగని విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో సరిహద్దు ఘర్షణల తరువాత పరిస్థితి మరింత దిగజారింది. పాక్‌లో ఆత్మాహుతి దాడులు కూడా కలకలం రేపుతున్నాయి. అఫ్గాన్ ప్రేరేపిత ఉగ్రవాదులే ఈ దాడులకు కారణమని పాక్ ఆరోపిస్తోంది. శనివారం కూడా పాక్‌లోని ఖైబర్ పాఖ్‌తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో మరో ఆత్మాహుతి దాడి జరిగింది. ఓ మిలిటరీ కాన్వాయ్‌ను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో లెఫ్టినెంట్ కల్నల్, మరో సైనికుడు మరణించారు. ఆ తరువాత కొన్ని గంటలకే పాక్ అఫ్గాన్‌లో సరిహద్దు వెంబడి వైమానిక దాడులు చేసింది. ఇక తాలిబాన్లు మాత్రం పాక్ ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు..

## ఆరోగ్యాన్ని మౌనంగా నాశనం చేసే అలవాట్లు

# ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన నిజాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎండలోకి వెళ్లకపోవడం సూర్యకాంతి లేకపోతే విటమిన్ ఊ తగ్గుతుంది. కాల్షియం శోషణ తగ్గుతుంది. ఎముకలు నెమ్మదిగా బలహీనపడతాయి. విరిగే ప్రమాదం పెరుగుతుంది. రోజూ కొద్దిసేపు ఉదయపు ఎండ అవసరం.

7) గ్యాస్ట్రైటిస్అతిగా తినడం

అతిగా తినడం వల్ల కడుపు గోడలు ఇర్రిటేట్ అవుతాయి. గ్యాస్, మంట, వాంతులు వస్తాయి. జీర్ణవ్యవస్థ బలహీనమవుతుంది. చిన్న మోతాదుల్లో నెమ్మదిగా తినడం మంచిది.

ఆసిడ్ రిఫ్లక్స్భోజనం తర్వాత వెంటనే పడుకోవడం తిన్న వెంటనే పడుకుంటే ఆమ్లం పైకి వస్తుంది. ఛాతిలో మంట, గొంతు మంట వస్తాయి. దీర్ఘకాలంలో ఈసోఫేగస్ నష్టం జరుగుతుంది. భోజనం తర్వాత కనీసం 2 గంటలు పడుకోకూడదు.

రక్తహీనతభోజనంతో పాటు టీ/కాఫీ

టీ, కాఫీ ఐరన్ శోషణను అడ్డుకుంటాయి. శరీరానికి ఇనుము అందదు. అలసట, తలతిరగడం వస్తాయి. భోజనం తర్వాత కనీసం గంట గ్యాప్ అవసరం.

కాలేయ ఒత్తిడిప్రాసెస్డ్ ఫుడ్

ప్యాకెట్ ఫుడ్‌లో రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. కాలేయం వాటిని ఫిల్టర్ చేయడానికి ఎక్కువగా పనిచేస్తుంది. ఫ్యాటీ లివర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఇంటి భోజనం ఉత్తమం.

మూత్రపిండ రాళ్లుతక్కువ నీరు

నీరు తక్కువగా తాగితే ఖనిజాలు గట్టిపడతాయి. రాళ్లు ఏర్పడతాయి. నొప్పి తీవ్రమవుతుంది. రోజంతా నీరు తాగడం చాలా అవసరం.

ఆస్తమాదుమ్ము, కాలుష్యం

కాలుష్య ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోకపోతే ఆస్తమా దాడులు పెరుగుతాయి. ఊపిరితిత్తులు బలహీనపడతాయి. మాస్క్ వాడటం అవసరం.

విటమిన్ డి లోపంఇంట్లోనే ఉండడం

ఎప్పుడూ బయటకు వెళ్లకపోతే సహజ విటమిన్ డి లభించదు. ఎముకలు, ఇమ్యూనిటీ బలహీనమవుతాయి. ఉదయపు వెలుగు అత్యంత అవసరం.

జ్ఞాపకశక్తి తగ్గడంఅధిక టీవీ,మొబైల్

ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల మెదడు క్రియాశీలత తగ్గుతుంది. ఆలోచనా శక్తి మందగిస్తుంది. పుస్తకాలు చదవడం, మాట్లాడటం అవసరం.

# తెలుగు రాష్ట్రాలకు ప్రతిపక్షాలు కావలెను!

ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటే ప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది.

**రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.**

**ఏపీలో తాము ప్రతిపక్షమే కాదనుకుంటున్న వైఎస్ఆర్‌సీపీ**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది.మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. వైసీపీ సాంకేతిక సాకులను పక్కన పెట్టి, ప్రజా సమస్యలనే అజెండాగా మార్చుకుని అసెంబ్లీకి వెళ్లాలి.ప్రజల పట్ల కనీస బాధ్యత లేని నేతగా మారిన జగన్ రెడ్డిఇక ఐదు సంవత్సరాలు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డగోలుగా అనుభవించిన జగన్ .. ఇప్పుడు పూర్తిగా ప్రజలను మర్చిపోయారు. వారానికి రెండు రోజులు బెంగళూరు నుంచి రాష్ట్రానికి రావడం, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్టును ప్రెస్ మీట్లలో చదివి వినిపించడం తప్ప ఆయన చేస్తుందేమీ లేదు. ఇప్పటికే ఆ పార్టీ అనుకూల పత్రికల్లో వస్తున్న కథనాలనే మళ్లీ గొంతు విప్పి చెప్పడం వల్ల కొత్తగా ప్రజల్లోకి వెళ్లే సందేశం ఏమీ లేదు. పైగా, ఆయన పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కంటే ఆర్భాటపు ఊరేగింపులకే పరిమితమవుతున్నాయి. ఈ క్రమంలో తలెత్తుతున్న భద్రతా లోపాలు సామాన్య కార్యకర్తల ప్రాణాల మీదకువస్తున్నాయి. ప్రజల పక్షాన పోరాడటం అంటే కేవలం కెమెరాల ముందు మాట్లాడటం కాదు, వారి కష్టాల్లో తోడుగా నిలబడటమని వైసీపీ నాయకత్వం గుర్తించలేకపోతోంది.మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు.

తామింకా ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని అంగీకరిస్తున్న బీఆర్ఎస్

తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నరా. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు. గత పదేళ్ల తమ పాలనలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి చేసే ప్రయత్నంలో, నేడు వారు చేస్తున్న విమర్శలే బూమరాంగ్ లా మారి వారికే తగులుతున్నాయి. కార్యకర్తలను రోడ్ల మీదకు నడిపించి ప్రజా పోరాటాలు చేయాల్సింది పోయి, కేవలం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించడం వల్ల పార్టీ క్యాడర్ కు సరైన దిశానిర్దేశం లేకుండా పోయింది.నాయకత్వం లేని సైన్యంలా గులాబీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాజ్యాధికారం శాశ్వతం కాదు, కానీ ప్రజా పక్షాన నిలబడటం నిరంతర ప్రక్రియ. బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికైనా తన అహంకారాన్ని వీడి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మారాల్సిన అవసరం ఉందన్న భావన వ్యక్తమవుతోందటే వారింకా తెలుసుకోలేదనే అర్థం.

కేవలం సోషల్ మీడియాలో బురద చల్లడం వల్ల అధికారం తిరిగి రాదు.

క్షేత్రస్థాయిలో ప్రజల విశ్వాసాన్ని మళ్ళీ పొందాలంటే వాస్తవాలతో పోరాడాలి. ప్రజల తీర్పును గౌరవించి, సభలోనూ, బయటా బాధ్యతాయుతమైన పాత్ర పోషించకపోతేడ ప్రజలిచ్చిన బాధ్యతను సరిగ్గా నెరవేర్చనట్లే.అధికారం కోసం చేసే పోరాటాలుగా మారుతున్న పార్టీల తీరుతెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న రాజకీయ పరిణామాలు కేవలం అధికారం కోసం సాగే పోరాటాలుగా మాత్రమే మిగిలిపోవడం ప్రజాస్వామ్యవాదులను తీవ్రంగా కలచివేస్తోంది. ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి ఒక దిక్సూచిలా, హెచ్చరికలా ఉండేది.

కానీ నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆ పరిస్థితి తలకిందులైంది. ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల కష్టాలను భుజానికెత్తుకోవాల్సిన పార్టీలు, కేవలం సోషల్ మీడియా వేదికగా సాగే 'డిజిటల్ యుద్ధాల'కే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో ఒక రకమైన రాజకీయ శూన్యత ఏర్పడింది. గణాంకాలను పరిశీలిస్తే, గత కొన్ని ఎన్నికల కాలంగా సోషల్ మీడియా పై రాజకీయ పార్టీలు పెడుతున్న ఖర్చు వందల కోట్లకు చేరింది. కానీ, అదే సమయంలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరిగే చర్చా సమయం మాత్రం దారుణంగా పడిపోయింది. గతంలో బడ్జెట్ సమావేశాలు నెల రోజుల పాటు సాగి, ప్రతి పద్దుపై లోతైన చర్చ జరిగేది. కానీ ఇప్పుడు అవి కేవలం వారం పది రోజుల్లోనే ముగిసిపోతున్నాయి. ప్రతిపక్షాలు హాజరు కాకపోవడం, వాకౌట్లు చేయడం, అసెంబ్లీని బహిష్కరించడం వల్ల విలువైన సమయం వృధా అవుతోంది.. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగంపై ఉండాల్సిన పర్యవేక్షణ పూర్తిగా సడలిపోతోంది. తెలంగాణలో బీఆర్ఎస్ పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. పదేళ్ల పాటు తిరుగులేని అధికారాన్ని అనుభవించిన ఆ పార్టీ, ఓటమి తర్వాత అంతర్గత విభేదాలతో సతమతమవుతోంది. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని ప్రచారం చేయడం మినహా, ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే నిర్మాణాత్మక కార్యక్రమాలు ఏవీ చేపట్టడం లేదు. తెలంగాణలో రైతు రుణమాఫీ, ఉపాధి హామీ లేదా సాగునీటి ప్రాజెక్టుల వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ విఫలమవుతోంది. ఆ పార్టీ నేత జగదీష్ రెడ్డి అన్నట్లు, వారు ప్రతిపక్ష పాత్రను స్వీకరించడానికి సిద్ధంగా లేరనేది అక్షర సత్యం. కేవలం ఐటీ హబ్‌లలో కూర్చుని సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రభుత్వంపై బురద చల్లడం వల్ల తాత్కాలికంగా కొంత హడావిడిసృష్టించవచ్చు కానీ, గ్రామీణ స్థాయి ఓటర్ల మనసు గెలవడం అసాధ్యం. తెలంగాణ ఉద్యమ సమయంలో క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన అదే పార్టీ, నేడు కేవలం డిజిటల్ స్క్రీన్లకే పరిమితం కావడం వారి రాజకీయ పతనానికి సంకేతంగా కనిపిస్తోంది.హిట్ అండ్ రన్ రాజకీయాలకు అలవాటు పడ్డ ప్రతిపక్ష పార్టీలుఅసలైన విషాదం ఏమిటంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు హిట్ అండ్ రన్ రాజకీయాలకు అలవాటు పడ్డాయి. ఏదో ఒక ఆరోపణ చేయడం, దానికి సోషల్ మీడియాలో రెక్కలు తొడగడం, ఆ తర్వాత దానిపై వచ్చే నిజనిజాలను పట్టించుకోకుండా మరో కొత్త ఆరోపణకు వెళ్లడం ఒక నిరంతర ప్రక్రియగా మారింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయని రోజంటూ లేదు. కానీ ఒక్క ఆరోపణలపైనా స్థిరంగా నిలబడి కొట్లాడలేకపోతున్నారు. ఏపీలో అయితే చెప్పాల్సిన పని లేదు. అసలు ఆరోపణలే విపక్షంపై వస్తూంటాయి. సోషల్ మీడియాలో వచ్చే 80 శాతం రాజకీయ పోస్టులు పెయిడ్ వర్కర్లు, బాట్స్ ద్వారా సృష్టిస్తున్నారు. అంటే ప్రజల నిజమైన నాడికి, సోషల్ మీడియాలో కనిపిస్తున్న ట్రెండ్‌లకు మధ్య సంబంధం తెగిపోయింది. అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందనే భ్రమలో ఉన్న పార్టీలు, ప్రజలు తమ విచక్షణతో నిజాన్ని గ్రహిస్తారనే విషయాన్ని మర్చిపోతున్నాయి. అసత్య ప్రచారాల వల్ల ప్రభుత్వాలకు వచ్చే నష్టం కంటే, ఆ ప్రచారం చేసే పార్టీల విశ్వసనీయతకే ఎక్కువ ముప్పు వాటిల్లుతోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడే నాయకత్వం లేకపోతే, పాలక పక్షం నిరంకుశంగా మారే అవకాశం ఉంటుంది. రాజకీయ శూన్యత కంటే ప్రతిపక్ష శూన్యతతెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాజకీయ శూన్యత కంటే ప్రతిపక్ష శూన్యత ఎక్కువగా కనిపిస్తోంది. సమర్థమైన ప్రతిపక్షం లేకపోతే అధికార పక్షం నియంతృత్వ ధోరణితో వ్యవహరించే ప్రమాదం ఉంది. రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ఈ నిజాన్ని గుర్తించి ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో వారు ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.



# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం




## మీరు మందు తాగుతారా..? గ్లాస్ పట్టుకునే ముందు ఈ నిజం తెలుసుకోండి.. లేకపోతే అంతే సంగతులు..

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 23**

వారమంతా ఆఫీసు పనులతో బిజీ.. వీకెండ్ వస్తే చాలు ఫ్రెండ్స్‌తో పార్టీ.. నేను రోజూ తాగనుగా.. వారానికి ఒక్కరోజే కదా.. నాకేం కాదు అని ధీమాగా ఉన్నారా? అయితే మీరు ప్రమాదంలో ఉన్నట్లే. వారమంతా తాగకుండా ఒక్కరోజే బింజ్ డ్రింకింగ్ చేయడం వల్ల మీ శరీరం లోపల జరిగే విధ్వంసం ఏంటో తెలిస్తే మీరు మళ్లీ గ్లాస్ పట్టుకోవడానికి భయపడతారు. చాలామంది వారం మొత్తం కష్టపడి, శని లేదా ఆదివారాల్లో చిల్ అవ్వడానికి మద్యాన్ని ఆశ్రయిస్తుంటారు. రోజూ తాగడం లేదు కదా.. వారానికి ఒక్కరోజే కదా.. ఏమవుతుందిలే అని సరిపెట్టుకుంటారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒక వ్యక్తి వారానికి 60 మి.లీ. వరకు ఆల్కహాల్ తాగితే అది చాలా మందికి సురక్షితమైన పరిమితి. కానీ అప్పుడప్పుడు తాగినా సరే, పరిమితికి మించి పెగ్గుల మీద పెగ్గులు వేస్తే అది శరీరంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. బింజ్ డ్రింకింగ్: వారమంతా తాగకుండా ఒక్కరోజే భారీగా మద్యం సేవించడాన్ని బింజ్ డ్రింకింగ్ అంటారు. ఇది రోజూ కొంచెం తాగడం కంటే ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల గుండె, కాలేయంపై నేరుగా ప్రభావం పడి, దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది. ఆల్కహాల్ నేరుగా రక్తంలోకి శోషించబడటం వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది. శరీరానికి కొవ్వు ముప్పు: మద్యంలో కేలరీలు చాలా ఎక్కువ. దీనికి తోడు సైడ్ డిష్‌గా జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో ముఖ్యంగా పొట్ట మరియు తొడల భాగంలో కొవ్వు వేగంగా పేరుకుపోతుంది. ఇది మెటబాలిజంను నెమ్మదింపజేసి,



బరువు పెరిగేలా చేస్తుంది. ఇతర ఆరోగ్య సమస్యలు: మద్యం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి మూత్రపిండాలపై ఒత్తిడి పెరుగుతుంది. బీపీ పెరగడం, హృదయ స్పందనలో హెచ్చుతగ్గులు రావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. క్రమం తప్పకుండా లేదా అధికంగా తాగడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతిని, మతిమరుపు వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు. వారానికి ఒక్కసారే కదా అని అతిగా తాగడం అంటే మీ ఆరోగ్యానికి మీరే స్వయంగా రెడ్ సిగ్నల్ ఇచ్చుకోవడమే. వినోదం కోసం తాగినా, అది వ్యసనంగా మారకుండా చూసుకోవడం ఉత్తమం.

## ముదిరాజులకు స్ఫూర్తిగా నిలుస్తున్న స్వామి లక్ష్మణ్‌లు!

- **సింగర్ స్వామి, పోలీస్ లక్ష్మణ్ లను సన్మానించిన మండల ముదిరాజులు!**

**మన దునియా చిన్నకోడూర్: ఫిబ్రవరి 23**



ముదిరాజులు అన్ని రంగాలలో విద్యా ఉద్యోగం గానం రచయితలుగా రాజకీయ నాయకులుజి వారి వారి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిభవంతులు కావాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఇట్టబోయిన స్వామి ముదిరాజ్ గుజారి గుజారి అనే జానపద గీతానికి ఐదు మిలియన్ల వ్యూస్ రావడంతో రచయితగా గాయకునిగా అవార్డు రాగా ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న దయ్యాల లక్ష్మణ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ బాడీ బిల్డర్ స్టేట్ సెకండ్ రావడంతో అతను కూడా అవార్డు తీసుకున్న సందర్భంగా చిన్నకోడూరు మండల ముదిరాజ్ నాయకులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు ఈ సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికాయల వెంకటేశంముదిరాజ్,



సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ ముదిరాజులు సమాజంలోనే వెనుకబడి ఉన్నారని ఇప్పుడిప్పుడే విద్యావంతులుగా ఎదుగుతూ అనేక రంగా లలో ముందుకు వెళ్తున్నారని అన్నారు ఆర్థికంగా ఎదగాలంటే విద్య తప్పని సరని విద్యను నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనివా స్ ముదిరాజ్,, మేడికాయల వెంకటేశం, ఇట్టబోయిన శ్రీనివాస్,, దూలం ముత్యం, పెండెల బాలయ్య, యాట రాజేష్, పడిగే లింగం, రాగి నాగరాజు, తుమ్మల తిరుపతి, పుప్పల బాలేష్, రేగుల కిషన్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ సామ్రాట్ గుప్తాకు టిడబ్ల్యుజేఎఫ్ అండ

**మన దునియా,ఖమ్మం, ఫిబ్రవరి 22**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ బ్రాడకాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీబీజేఏ) జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను టిడబ్ల్యుజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్ లు పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యూనియన్ నాయకులు స్పందించి ఖమ్మంలోని భవాని హాస్పిటల్‌కు తరలించి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహింప జేశారు. వైద్యుల సూచన మేరకు ఆయన కుడి కాలుకు సాధారణ శస్త్రచికిత్స నిర్వహించగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ చక్రవర్తి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకుని అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందుకున్న జిల్లా నాయకులు వంగ పుంగమ గౌడ్, కందరబోయిన నాగకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని సామ్రాట్ గుప్తాను ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. అనంతరం శస్త్రచికిత్స పూర్తయ్యాక ఆయనను వైద్యుల సూచన మేరకు విశ్రాంతి కోసం తన నివాసానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి సామ్రాట్ గుప్త కు వైద్య సేవల సహకారం అందించిన జర్నలిస్టు మిత్రులను అభినందించారు. టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) కుటుంబం ఎప్పుడూ ఐక్యంగా ఉండాలని, ఇలాంటి ప్రమాదకర ఘటనలు జరిగినప్పుడు పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.




## ఐఎస్ఐ కుట్ర భగ్నం.. 8 మంది ఉగ్రవాదుల అరెస్ట్!

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 21**



తమిళనాడు, బెంగాల్‌లలో భారీ ఆపరేషన్ తిరుప్పూర్ గార్మెంట్ యూనిట్లలో తలదాచుకున్న నిందితులు నకిలీ ఆధార్ కార్డులతో బంగ్లాదేశీయుల హల్‌చల్ మెట్రో స్టేషన్లలో రెచ్చగొట్టే పోస్టర్లు ఎనిమిది మొబైల్స్ 16సింకార్డులు స్వాధీనం చేసుకున్న పోలీసులు దేశ రాజధానిలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నిన పాకిస్థాన్ ఐఎస్ఐ, బంగ్లాదేశ్ ఉగ్రవాద సంస్థల నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీసులు చిత్తు చేశారు. ఆదివారం చేపట్టిన మెరుపు దాడిలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వెనుక విదేశీ హ్యాండ్లర్ల హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీ మెట్రో పరిసరాల్లోనూ, నగరంలోని కీలక ప్రాంతాల్లోనూ కశ్మీర్ అంశంపై రెచ్చగొట్టే పోస్టర్లు వెలిశాయి. వీటిపై ఆరా తీసిన స్పెషల్ సెల్ పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఈ పోస్టర్ల మూలాలు వెతుక్కుంటూ వెళ్లగా.. తమిళనాడులోని తిరుప్పూర్ కేంద్రంగా సాగుతున్న టెర్రర్ మాడ్యూల్ బయటపడింది. అక్కడ గార్మెంట్ కంపెనీల్లో కార్మికులుగా నటిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరిని బెంగాల్‌లో పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో మిజానూర్ రెహ్మాన్, మహమ్మద్ షాబత్ సహా పలువురు బంగ్లాదేశ్ పౌరులు ఉన్నట్లు సమాచారం. వీరంతా నకిలీ ఆధార్ కార్డులతో ఇక్కడ నివసిస్తున్నారు. వీరి వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలోని డేటా ఆధారంగా ఈ ముఠాకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విదేశీ గడ్డపై ఉన్న హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు భారత్‌లో భారీ ఉగ్రవాద దాడికి వీరు ప్లాన్ చేసినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం నిందితులను ఢిల్లీకి తరలిస్తున్నారు. వీరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ముఠా అరెస్టుతో దేశవ్యాప్తంగా నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది.

## కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం పాడి ఎద్దుకు గాయాలు..

**మన దునియా,గూడూరు గుండెంగ:ఫిబ్రవరి 23**





గూడూరు మండలం లోని గుండెంగ గ్రామ పరిధిలోని గండసోములుతండాకు చెందిన బోడ ధన్యకు చెందిన పెంకుటిల్లు శనివారం మధ్యరాత్రి 11గంటలకు కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా కాలి బూడిదై సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. అగ్నిప్రమాదం సమయంలో ఇంటిలో ఉన్న సామాను మొత్తం అగ్నికి ఆహుతైంది. అదేవిధంగా ఒక పాడి ఎద్దుకు గాయాలు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బోడ ధన్య నిరుపేద గిరిజన కుటుంబానికి చెందినవారు కావడంతో, ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి, నష్టాన్ని అంచనా వేసి తక్షణ సహాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రేపటి నుంచి సర్పంచులకు శిక్షణ తరగతులు!!

**ఖేజన్నారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పేరం శ్రీనివాస్**

**మన దునియా (ప్రతినిధి శరత్) :ఫిబ్రవరి 22,**



మంచిర్యాల జిల్లా ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో రేపటి (సోమవారం) నుంచి ఈ నెల 27వ తేదీ వరకు సర్పంచులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జన్నారం మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జన్నారం మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ శిక్షణ కార్యక్రమానికి ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో హాజరు కావాలని కోరారు. గ్రామ అభివృద్ధి,పంచాయతీ రాజ్ చట్టాలు,పాలనపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ శిక్షణను ఏర్పాటు చేసిందని,కావున సర్పంచులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

మన దునియా
Our News Our World
మన అక్షరం – మన ప్రపంచం
RNI Number
TELTEL/2023/85680

# ఆయేషా మీరా

ఆయేషా మీరా ఆయేషా మీరా
నీకు కాస్త ఆలస్యంగా
అన్యాయం జరిగినందుకు క్షమించు తల్లి
స్వాతంత్ర్యం సమాధి అయిన చోట
రాజ్యాంగం రక్తసిక్తం అవుతున్న పూట
న్యాయం కళ్ళు కాదు
ఏకంగా ఒళ్ళు కూడా కోల్పోయిన చోట
దశాబ్దాల ఎదురుచూపు నిన్ను ఏకాకిగా మిగిల్చి
పాపం,పాపాత్ములు కలిసి పండుగ చేసుకునే క్షణంలో
నీ హృదయం మరోసారి బద్దలై ఉంటుంది
మీ ఆత్మకు క్షోభించడానికి కూడా
మనసు రాకపోయి ఉంటుంది
ఆయేషా మీరా ఆయేషా మీరా
మీరు ఎక్కడున్నా
సుగాలి ప్రీతి,ప్రత్యూషలు
నీ పక్కనే ఉంటూ నీకు తోడుగా ఉంటారు
మీరు అక్కడైనా ఆనందంగా ఉంటారు
హా।।
త్యలు,
అ।।
త్యాచారాలతో
మా సమాజం నిత్యం శోభిస్తూనే ఉంటుంది
నీతో పేగు తెంచుకొని పుట్టకపోయినా
ఈ దేశాన్ని, ఈ మట్టిని, ఈ మనుషులని,
ఈ నాయకులను, ఈ న్యాయాన్ని,
ఈ అస్తవ్యస్తవ్యవస్థను, ఈ దౌర్జన్యాన్ని,
ఈ దౌర్భాగ్యాన్ని పంచుకొని పుట్టినందుకు
మా మొహాల మీద కాం।।
డ్రించి ఉ।।
మ్మేందుకు ఏమాత్రం వినకాడకు తల్లి
మరో గ్రహం నుంచి గ్రహాంతరవాసులెవరో
అకస్మాత్తుగా ఆకాశం నుండి ఊడిపడి
నీ ప్రాణాలు తీసుంటారు
నిన్ను అ।।
త్యాచారం చేసి ఉంటారు
నీ నుదిటి మీద చిరుత అని
నీ తల రాత రెండోసారి రాసి ఉంటారు
నీ కేసునే కాదు
నీ లాంటి బాధితుల అత్యాశలను కూడా క్లోజ్ చేస్తున్నాం
ఇక న్యాయం అనే పదాన్నే కాదు
న్యాయాన్నే ఇక్కడ రద్దు చేస్తున్నాం
చట్టానికి రాజ్యాంగానికి కట్టుబడి
రేపటి పౌరులకు,ప్రాణాలకు, స్వేచ్ఛకు ఇక్కడ
ఏ అవకాశం లేదని
హక్కులు చుక్కల్లో కలిసిపోయి
చాన్నాళ్లు అయిపోయిందని సంతోషంగా సగర్వంగా ప్రకటిస్తున్నాం...



# సముద్రంలో కనిపించే నీటికుక్క గ్రామ చెరువులో ప్రత్యక్షం..

**మన దునియా,సూర్యాపేట జిల్లా:ఫిబ్రవరి 22**

పెన్ పహాడ్ మండలం, ధర్మాపురం గ్రామంలోని మధిరామక్క చెరువులో శుక్రవారం ఉదయం గ్రామస్తులకు నీటి కుక్క కనిపించింది.గ్రామస్తులకు వింతగా కనిపించిన ఆ జంతువును యువకులు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.పెద్ద పెద్ద సముద్రాలలో కనిపించే నీటి కుక్క తమ గ్రామ చెరువులో కనిపించడంతో ఈ నీటీ కుక్క చూడడానికి గ్రామస్తులు చెరువు దగ్గరికి పరుగులు తీశారు.



# బతుకు పాఠం




**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 22**

నా పేరు ఆనందరావు. నా పేరులోని ఆనందం ఎన్నడూ నా జీవితపు దరిదాపుల్లోకి రాలేదనే చెప్పాలి. నా వంటిమీదకి పాతికేళ్ళు ముంచుకొచ్చినా, ఇప్పటికీ ఒక్క అడుగు కూడా పురోగతి సాధించలేకపోయాను. అనునిత్యం నా బాధలూ, కష్టాలనూ నెమరు వేసుకుంటూ, అందరిముందు సాగిలపడుతూ సాదాసీదాగానే సాగిపోతున్నాను. నా మిత్రులందరి జీవితాలతో పోల్చుకుంటే నేను అతిగానే వెనుకబడిపోయానని ఒప్పుకుని తీరాలి. ఓటమిని సునాయాసంగా ఒప్పుకోవడం, అంగీకరించడం.. చిన్నప్పటి నుంచి అమ్మ నాకు అన్నంతోపెట్టిన అస్త్రవిద్యగా నా నరనరాన్నా జీర్ణించుకుపోయేలా బోధించింది. తరువాతర్వాత అదే బతుకైపోయింది. తాగుడుకి బానిసైన నాన్న, ఓరోజు అమ్మనీ, నన్నూ, తమ్ముడూ, చెల్లాయిలనూ.. 'మీ బతుకులు.. మీరు చావండి..' అని నిర్దాక్షిణ్యంగా తాగిన మైకంలో తేలిపోతూ, మమ్మల్ని గాలికి వదిలేసి, గాలిలో కలిసిపోయాడు. 'ఇంటికి పెద్దదిక్కులేని కుటుంబం మనది. అందరి దగ్గర తగ్గి, తలొగ్గి బతకాలి..' అంటూ మా అమ్మ ప్రతిరోజూ, ప్రతీక్షణం బతుకుపాఠంగా నాకు నూరిపోసిన ఆ పిరికితనమే ఈరోజు నన్నిలా నా ఆత్మహత్యకు దారి తీయిస్తూ, అడుగులను ముందుకు వేయిస్తోంది. రూము అద్దె ఆరునెలలుగా చెల్లించలేదని మా హౌస్ ఓనర్ అన్న ఆ మాటలు ఇంకా నా చెవుల్లో గింగురుమంటున్నాయి. 'వెయ్యి రూపాయిల అద్దె కూడా కట్టుకోలేని బతుకు.. నీకు అవసరమా? ఇలాంటి బతుకు బతకడం కన్నా చావడం మేలు.. ఇంకెవరికైనా అద్దెకిచ్చుకుంటాను' అంటూ ఉదయాన్నే వచ్చి పరుషంగా నిందించి, కోపంగా వెళ్ళిపోయాడు.అయినా నాకు అతనిమీద ఎటువంటి కోపం రాలేదు. ఎందుకంటే అమ్మ నాలోని అణువణువునా అలాంటి సర్దుకుపోయే మనస్తత్వాన్ని రంగరించి నూరుపోసింది. ముందురోజు రాత్రే అమ్మ ఫోన్ చేసింది. 'ఒరే ఆనందూ, వడ్డీ డబ్బులకోసం పరమేశం వచ్చి, పెద్దగొడవే చేసాడురా! అసలూ, వడ్డీ కలిపి ఇస్తేనే ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ మన గుడిసె దగ్గర నానారభసే చేశాడు చాలాసేపూ..' అంటూ అమ్మ ఎప్పటిలా కన్నీటి బాధని వెళ్ళగక్కింది.'ఎవరి ఫోన్ నుంచైనా నీ స్నేహితుడు రాంబాబు ఫోనుకి డబ్బులు పంపించరా. ఎంతో కొంత వాడి మొహాన కొడితేగానీ, ఇక్కడ పరిస్థితి కాస్త సర్దుకునేలా లేదు..' అంటూ అమ్మ దీనంగా అర్థిస్తూ బాధపడింది. అమ్మ గొంతులోని దైన్యం నన్ను మరింత క్రుంగదీసింది.మా నాన్న చనిపోయినా.. అతను చేసిన అప్పులకీ నేటికీ పురుడు పోసుకుంటున్న విపరీత వడ్డీలు మమ్మల్ని దారిద్ర్యరేఖకు దిగువన కూడా బతకనీయకుండా రోజురోజుకి భయపెడుతూ, భరించలేనంతగా భారమైపోయాయి.నేను, ఓ డిపార్ట్‌మెంట్ స్టోరులో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నాను. నేనీ ఉద్యోగం కోసం వెళ్లినరోజు మా యజమాని నెలకు పదివేలు రూపాయలు జీతం ఇస్తానని గొప్పగా చెప్పాడు. నేను ఎంతో ఆనందించి, సంతోషంతో సరేనన్నాను.ఆ రోజు రాత్రి రూంకెళ్ళాక అమ్మకు ఫోన్ చేసి 'నాకు నెలనెలా పదివేల రూపాయలు జీతం..' అని ఎంతో గొప్పగా చెప్పుకుని, మురిసిపోయాను. ఆ ఆనందంతో ఆ రోజు రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు కూడా!'ఈ ఉద్యోగం దొరకడం నీ అదృష్టంరా!' అంటూ అమ్మ ఎంతో పొంగిపోయింది. అమ్మ మాటలు నాలో కొండంత ధైర్యాన్నిచ్చాయి. ఆ తర్వాతే తెలిసింది నాకు అమ్మచెప్పిన నా అదృష్టం ఏ పాటిదో..!నా ఉద్యోగంలో చేర్చుకున్నప్పుడు మా డిపార్ట్‌మెంట్ స్టోరు యజమాని ఓ షరతు పెట్టాడు. 'నువ్వెవరివో నాకు తెలియదు. కాబట్టి, నీ టెన్త్, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ నా దగ్గర హామీగా కుదవబెడితేనే.. నీకీ ఉద్యోగం..' అన్నాడు.నేను మరింకేమీ ఆలోచించకుండా ఆ కాగితాలు 'నా దగ్గర ఉంటేనేమి.. అతని దగ్గర ఉంటేనేమిట?!' అనుకుని అతనడిగిన నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ అతని చేతుల్లో పెట్టాను. నేను ఉద్యోగంలో చేరి ఓ నెలరోజులు పూర్తికావస్తోండగా మా స్టోరు యజమాని 'రేపు నీ జీతం ఇస్తాను..!' అన్న మాటలు నన్నెంతో ఆనందానికి గురిచేశాయి. రాబోయే జీతం డబ్బులుతో ఏమేమి చేయాలో అర్ధరాత్రి వరకూ ఆలోచిస్తూ నిద్రపోయాను.రాత్రి సరిగ్గా నిద్ర పోలేకపోయినా ఉదయాన్నే ఉత్సాహంగా లేచి, డ్యూటీకి రెడీ అవుతుండగా నా కీప్యాడ్ సెల్‌ఫోన్ మోగింది. మా స్టోరులో నాతోపాటు పనిచేసే ఓ కుర్రాడు ఫోన్ చేసాడు. 'ఒరేరు, మన స్టోరులో షార్ట్ సర్క్యూట్ మూలంగా చాలా సామాన్లు కాలిపోయాయి. నువ్వు అర్జంటుగా రా..!' అంటూ పిడుగులాంటి వార్త నా నెత్తిన కుమ్మరించాడు. నేను హడావిడిగా బయలుదేరి వెళ్ళాను. మా స్టోరులో కొంతభాగం కాలిపోయింది. మరికొంత భాగం బాగానే వుంది. ఇన్స్యూరెన్సు క్లెయిమ్ చేయడానికి మా యజమాని ఫొటోలు, వీడియోలు తీయించాడు. ఎవర్నో రప్పించి స్టోరంతా దగ్గరుండి చూపించాడు. ఆ రోజు మా స్టోర్ తెరవలేదు. కానీ, మాకు డ్యూటీ చేయక తప్పలేదు. నేనూ, మరో ఇద్దరూ కలిసి సామానులన్నిటినీ పొందికగా సర్దిపెట్టడానికే సరిపోయింది ఆ రోజంతా. పనంతా పూర్తయ్యేసరికి నా వళ్ళంతా హూనమైపోయింది. రాత్రి పదకొండు గంటలు దాటిపోయింది.నేను ఇంటికి బయల్దేరేటప్పుడు మా యజమాని నా జీతం డబ్బులు ఇస్తాడేమోనని ఆశగా అతనికేసి చూసాను. అతను నా మనసులోని ఉద్దేశ్యాన్ని పసిగట్టినట్టుగా 'ఒరేరు ఆనందూ! ఇన్స్యూరెన్సు డబ్బులు త్వరలో వచ్చేస్తాయి. అప్పుడు నీ జీతం ఇస్తాను..!' అన్నాడు. నేను ఇంకేమీ మాట్లాడలేక ఊరకుండిపోయాను.ఆ తర్వాత నేను ఎప్పుడన్నా జీతం గురించి అడిగినా 'ఇన్స్యూరెన్సు డబ్బులు ఇంకా రాలేదు..!' అంటూ నా ఆరునెలలుగా నా జీతాన్ని వాయిదా వేస్తూ నాతో పని చేయించుకుంటున్నాడు. నేను ఇంటి దగ్గర నుంచి అప్పు చేసి తెచ్చుకున్న డబ్బులు ఎంత పొదుపుగా వాడుకున్నా, ఎప్పుడో ఖర్చయిపోయాయి. తినడానికి కూడా ఇబ్బందిగా తయారైంది నా పరిస్థితి. ఈ విషయాన్ని మా యజమానికి చెప్తే.. నా జీతం ఇవ్వలేదు కానీ, తన ఇంటి దగ్గర నుంచి నా కోసం ఓ బాక్స్‌తో అన్నం తీసుకొస్తున్నాడు. నేను రాత్రి స్టోరు నుంచి నా రూముకి వచ్చేటప్పుడు టిఫిన్ చేయమంటూ రోజూ ఓ ఇరవై రూపాయలిచ్చి, తన ఖాతా బుక్‌లో లెక్క రాసుకుంటున్నాడు. నాకు ఆలస్యంగా అర్థమైంది. నా యజమాని నన్ను దగా చేస్తున్నాడని! కానీ నా రక్తంలో ప్రవహిస్తోన్న పిరికితనం నన్ను మరింకేమీ ఆలోచించనివ్వలేదు.

హౌస్ ఓనర్ మాటలకు ఎంతగానో నొచ్చుకున్న నేను రూం నుంచి బయల్దేరినప్పుడు ఫలానా చోటుకి వెళ్లాలని ఏమీ అనుకోలేదు. కానీ ప్రస్తుత నా గమ్యం మాత్రం 'కచ్చితంగా చచ్చిపోవాలి' అనుకుంటూ వడివడిగా ముందుకు అడుగులు వేస్తున్నాను. దూరంగా రైల్వేస్టేషన్ కనిపించింది. అంటే– రైలు చక్రాల కింద నా కష్టాలూ, కన్నీళ్ళూ.. అన్నీ ఈ రోజుతో నుజ్జునుజ్జయిపోయి, అంతమైపోతున్నాయన్న మాట. ఆ ఆలోచన మనసుకి ఎంతో హాయినిచ్చింది. ఆ హాయి ఎలాంటిదంటే సమస్యల సుడిగుండాల్లోంచి సేదతీరిన చల్లటి అనుభూతి.మళ్ళీ అంతలోనే అమ్మా, తమ్ముడూ, చెల్లీ.. నా కుటుంబం అంతా కళ్ళ ముందు కదిలేసరికి, తట్టుకోలేని దుఃఖం తన్నుకొచ్చింది. నా కళ్ళల్లో నీళ్లు ఒక్కసారిగా వెల్లువలా ధారలుకట్టాయి. అంతలోనే స్పృహలోకి వచ్చిన నేను 'ఎవరూ చూడలేదు కదా' అని చుట్టూ చూసి చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాను. ఆ రోడ్డు మీద నడుస్తోన్న వారంతా తమతమ సాధకబాదకాలతో పరుగులు తీస్తున్నారు. అప్పుడే రోడ్డు పక్క నా కంటపడిన ఓ దృశ్యం నన్ను ఉన్నచోటినే ఆగిపోయేలా చేసింది. ఓ కోడిపెట్ట తన పిల్లలను తన రెక్కలతో రక్షణ కలిపిస్తూ, వాటిని ఎలాగైనా ఎత్తుకుపోవాలని ప్రయత్నిస్తోన్న గ్రద్దను.. తన శక్తి మేరకు ఎగిరెగిరి ఎదురిస్తూ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఆ గ్రద్ద తన ప్రయత్నాన్ని అలాగే చాలాసేపూ హోరాహోరీగా పోరాడుతూనే ఉంది. ఆ తల్లికోడి తన శక్తిసామర్థ్యాలను మించి గ్రద్దను ఎదుర్కొంటోంది. చిట్టచివరకు ఆ గ్రద్ద తన ఓటమిని అంగీకరిస్తూ అక్కడ నుంచి దూరంగా పారిపోయింది.అంతే ఆ తల్లికోడి ఒక్కసారిగా తల విదిలించుకుని, ఒక్కసారిగా ఊపిరి ఎగబీల్చుకుని మొండి ధైర్యంతో, అంతులేని ఆత్మవిశ్వాసంతోనూ ఆకాశంకేసి ఎర్రగా చూసింది. ఆ చూపుల్లో సడలిపోని తెగింపు తొంగి చూస్తోంది! దాని కళ్ళల్లో అనిర్వచనీయమైన బతుకు బాధ్యత సుస్పష్టంగా ప్రస్ఫుటిస్తోంది. ఆ సంఘటన నాలో ఏదో తెలియని భావావేశాన్నీ, కాస్త ఆలోచన్నీ రేకెత్తించాయి. ఎన్నాళ్లగానో నాలో నిద్రాణమైపోయిన ఓ కాంతిపుంజం తళుక్కున మెరిసినట్టనిపించి, నా శరీరం మేల్కొన్నట్టుగా ఒక్కసారిగా రోమాంఛితమైంది. నాలో అనంతమైన ఆలోచనల ప్రవాహం పరుగులు తీస్తున్నాయి. కొత్తరక్తం ఉరకలేస్తోంది. అంతే– నా ఆత్మహత్య ఆలోచనని అవతలికి నెట్టేసి, నా భవిష్యత్ కార్యాచరణ నా కళ్ళ ముందు సాక్షాత్కరించింది. మా యజమానిని నా తోటి సేల్స్‌మేన్ సహకారంతో గట్టిగా నిలదీయాలని, నాకు రావాల్సిన జీతం గురించి గట్టిగా నిలదీసి అడగాలని, జేబులోంచి ఫోన్ తీసి, స్టోరు యజమానిని నిలదీయాల్సిన కార్యాచరణ గురించి నా సహబాధితుడితో మాట్లాడి, ఫోన్ నా ప్యాంటు జేబులో పెట్టుకున్నాను.. నిండైన మొండి ధైర్యంతో.నాలోని ఆ ధైర్యం ఉవ్వెత్తున ప్రవహిస్తోంది. నా మదిలో ఒక్కటే ఆలోచన! నా ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆరునెలల జీతాలూ ఇచ్చాడా సరేసరి.. లేదంటే–ఎంతదూరమైనా అలుపెరుగని పోరాటంతో అడుగులు వేస్తాను. సంఘం దృష్టికి తీసికెళ్తాను. వారి మాట కూడా యాజమాన్యం లెక్కచేయకపోతే.. హ్యూమన్ రైట్స్ వారి సహకారం తీసుకుంటాను. అదీ కాకపోతే మీడియా సహకారంతో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతాను. నా సమస్య పరిష్కారం దిశగా అవసరమైతే జిల్లా కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి వరకైనా తీసుకువెళ్తాను.. వదిలిపెట్టే ప్రసక్తేలేదు. కచ్చితంగా సాధించి తీరుతాను!

'బతకడం' అనే జన్మతః సిద్ధించిన నా హక్కును నేను సాధించుకుంటాడ' స్థిరంగా మళ్ళీమళ్ళీ మననం చేసుకుంటూ కనుచూపు మేరలో కనిపిస్తోన్న మా డిపార్ట్‌మెంట్ స్టోరు వైపు స్థిరంగా వడివడిగా అడుగులు వేస్తున్నాను.. నిర్భయంగానూ, అచంచలమైన ఆత్వవిశ్వాసంతోనూ!

## గర్భిణీ స్త్రీలకు పథకం.. ఉచితంగా రూ.11,000

**మన దునియా,న్యూఢిల్లీ:ఫిబ్రవరి 22**

గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పి ఎమ్ ఎమ్ వి వై) పథకం ద్వారా మొత్తం రూ.11,000 వరకు ఆర్థిక సహాయం లభిస్తుంది. మొదటి కాన్పుకు రూ.5,000 మూడు విడతల్లో జమ అవుతుంది. గర్భధారణ రిజిస్ట్రేషన్ తర్వాత రూ.1,000, ఆరవ నెల తర్వాత రూ.2,000, శిశువు తొలి టీకా అనంతరం రూ.2,000. అలాగే రెండో కాన్పుకు అదనంగా రూ.6,000 అందిస్తారు. దరఖాస్తు కోసం అంగన్‌వాడీ కేంద్రంలో ఫారం నింపి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, గర్భధారణ రిపోర్ట్ సమర్పించాలి. లేకపోతే అధికారిక వెబ్‌సైట్ ద్వారా అప్లై చేయవచ్చు.



మన దునియా
Our News Our World
RNI Number
TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
ఫిబ్రవరి । సోమవారం । 23 । 2026


# అక్రమ సంబంధం ఎఫెక్ట్... ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

**రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘటన**
**నిద్రిస్తుండగా దిండుతో ఊపిరాడకుండా చేసి భర్తను చంపిన భార్య**
**భార్య రాజేశ్వరి, ప్రియుడు శరత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు**
**మృతుడి తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన దారుణ ఘటన**

**మన దునియా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల:ఫిబ్రవరి 22**



సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారగూడం కృష్ణ (35), జీడిమెట్లకు చెందిన రాజేశ్వరిని 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్‌లో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం రాజేశ్వరికి శరత్ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడి, అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో కృష్ణను అడ్డు తొలగించుకోవాలని రాజేశ్వరి, శరత్ నిర్ణయించుకున్నారు. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన కృష్ణతో రాజేశ్వరి గొడవపడింది. అతను నిద్రలోకి జారుకున్నాక, ప్రియుడు శరత్‌కు ఫోన్ చేసి పిలిపించింది. ఇద్దరూ కలిసి కృష్ణ కాళ్లు, చేతులు కట్టేసి, ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేశారు. అనంతరం శరత్ అతని ఛాతీపై బలంగా కొట్టడంతో కృష్ణ మృతి చెందాడు. హత్య తర్వాత ఏమీ తెలియనట్లు నటించిన రాజేశ్వరి, శుక్రవారం ఉదయం తన భర్త పలకడం లేదంటూ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అయితే, అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణ మృతిపై అనుమానం వ్యక్తం చేసిన అతని తల్లి అంజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేశ్వరిని విచారించగా అసలు నిజం ఒప్పుకుంది. ఆమె ఇచ్చిన సమాచారంతో ప్రియుడు శరత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు.. కూటమిలో కమల్ హాసన్ చేరడంతో మారనున్న సీట్ల లెక్క

**2021 తరహాలోనే సీట్ల పంపకాలు కోరుకుంటున్న డీఎంకే**
**ఎక్కువ స్థానాలు ఆశిస్తున్న కూటమి పార్టీలు కాంగ్రెస్, డీఎండీకే**
**కొత్తగా కమల్ హాసన్ కూటమిలో చేరడంతో మారనున్న సీట్ల లెక్కలు**

**మన దునియా,తమిళనాడు: ఫిబ్రవరి 22**



త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే పార్టీకి పొత్తుల విషయంలో చిక్కులు కనిపిస్తున్నాయి. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్‌పీఏ)లో సీట్ల పంపకాలకు సంబంధించి నేటి నుండి చర్చలు ప్రారంభం కానున్నాయి. 2021లో ఏ విధంగా అయితే పంపకాలు జరిగాయో ఈసారి అదే విధంగా ఉండాలని డీఎంకే కోరుకుంటోంది. అదే సమయంలో మిత్రపక్షాలు మరిన్ని ఎక్కువ సీట్లను ఆశిస్తున్నాయి.2021లో 234 అసెంబ్లీ స్థానాలకు గాను డీఎంకే 188 పోటీ చేయగా, మిగిలిన సీట్లను మిత్ర పక్షాలకు ఇచ్చింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ 25 సీట్లు తీసుకోగా, మిగిలిన పక్షాలు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి. ఈసారి కూటమిలోకి కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) పార్టీ వచ్చి చేరింది. ఇప్పటికే మిత్రపక్షాలు తాము కోరుకుంటున్న స్థానాలతో కూడిన జాబితాను డీఎంకేకు అందించినట్లు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగిల్ డిపాజిట్‌కు పరిమితమైన తాము ఈసారి డబుల్ డిజిట్ సీట్లను కోరుకుంటున్నామని కమ్యూనిస్టు పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఎక్కువ సీట్లను ఆశిస్తోంది. డీఎండీకే పార్టీకి ఆరు నుంచి ఎనిమిది సీట్లు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కమల్ హాసన్ ఎంఎన్‌ఎం పార్టీ 2024 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా డీఎంకే కూటమికి మద్దతు ఇచ్చింది. ప్రతిగా కమల్ హాసన్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఈ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసింది. ఇప్పుడు డీఎంకే కూటమిలో చేరిన కమల్ హాసన్, తగిన సమయంలో తన పార్టీకి ఎన్ని సీట్లు కావాలో చెబుతానని ఇదివరకు ప్రకటించారు. అయితే డీఎంకే మాత్రం గత అసెంబ్లీలో పోటీ చేసిన స్థానాల కంటే తమకు తగ్గకూడదని కోరుకుంటోంద

# “తెలంగాణకు దిశా నిర్దేశం చూపేది తీన్మార్ మల్లన్ననే”



**మన దునియా,నాగర్ కర్నూల్ జిల్లా:ఫిబ్రవరి 22**

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసేది, అన్ని రాజకీయ నాయకులకు సిగ్గుచేటు..? తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సమస్యపై ముందుండి స్పందిస్తూ, ప్రజల తరఫున పోరాటం చేస్తున్న నాయకుడిగా తీన్మార్ మల్లన్న పేరును ప్రజలు ముందుకు తెస్తున్నారు. సామాన్యుల సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ, అధికార వ్యవస్థను నిలదీస్తూ ఆయన చేస్తున్న పోరాటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజల అభిప్రాయం ప్రకారం, పార్టీ గీతలు, రాజకీయ భేదాలు పక్కనపెట్టి ప్రజల సమస్యల కోసం నిలబడే నాయకత్వం అవసరమని, ఆ దిశగా మల్లన్న పోరాటం ఒక సంకేతమని వారు అంటున్నారు. అన్ని రాజకీయ పార్టీలకు ఇది ఒక హెచ్చరికలా మారిందని, ప్రజల సమస్యలను విస్మరిస్తే ప్రజలే తగిన సమాధానం ఇస్తారని సామాజిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రజా సమస్యలపై స్పష్టమైన స్వరం చిన్నారి హత్య వంటి విషాద ఘటనలపై కూడా ఇతర రాజకీయ పార్టీలు మౌనం పాటించిన సమయంలో మల్లన్న స్పందించారని ప్రజలు గుర్తుచేస్తున్నారు. అన్యాయంపై ఎవరు మాట్లాడకపోయినా, తాను మాట్లాడుతున్నాడనే భావన ప్రజల్లో పెరుగుతోందని విశ్లేషకులు అంటున్నారు. ప్రతి ఇంట్లో ప్రజా చైతన్యం కలగాలని, ప్రతి వ్యక్తి ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని, అదే నిజమైన ప్రజాస్వామ్య లక్షణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ జెండాలతో ప్రజల జీవితాలు మారవని, ప్రజల పక్షాన నిలిచే నాయకత్వమే రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని సామాన్యులు చెబుతున్నారు. రాజకీయాలపై ప్రజల సందేశం ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం అవసరం అన్యాయాలపై ధైర్యంగా ప్రశ్నించాలి పార్టీ రాజకీయాల కంటే ప్రజా ప్రయోజనం ముందుండాలి ప్రతి ఇంట్లో చైతన్యం కలగాలి తెలంగాణ మారాలంటే ప్రజలే ప్రశ్నించాలి, ప్రజలే నిర్ణయించాలి అనే భావన విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో తీన్మార్ మల్లన్న పోరాటం ఒక రాజకీయ ప్రకటనగా మారిందని పరిశీలకులు భావిస్తున్నారు.ప్రజల తరఫున నిరంతరం స్వరం వినిపించే నాయకత్వం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది. తెలంగాణలో ప్రజా సమస్యలపై చైతన్యం పెరుగుతున్న ఈ సమయంలో, ప్రజల ఆకాంక్షలు నాయకుల చర్యలు ఎలా కలిసిపోతాయో భవిష్యత్తే నిర్ణయించనుంది.

# అర్ధరాత్రి అడవుల్లో తవ్వకాలు..

**గుప్త నిధుల కోసమేనా...?**
**మరి ఏదైనా పని కోసమా...?**
**అధికారులం అంటూ జెసిబి తో అడవుల్లో తవ్వకాలు జరుపుతున్న గుర్తుతెలియని వ్యక్తులు...**
**అడ్డుకొని ప్రశ్నించిన సీతానగరం గ్రామ యువకులు...**




**మన దునియా,మహబూబాబాద్ జిల్లా గూడూరు:ఫిబ్రవరి 22**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అటవీ ప్రాంతాలలో అర్ధరాత్రి తవ్వకాలు కలకలం రేపింది. రెండు కార్లు ఒక ద్విచక్ర వాహనం మరియు ఒక జెసిపి తో గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు అర్ధరాత్రి అటవీ ప్రాంతాలలో తవ్వకాలను ప్రారంభించారు. రెండు దిక్కుల నాలుగు నుండి ఎనిమిది ఫీట్ల లోతు వరకు తవ్వి వదిలిపెట్టి నేషనల్ 360 హైవే రోడ్డు సమీపంలో మరో మారు తవ్వకాలు దొరుకుతున్న సమయంలో సీతానగరం గ్రామపంచాయతీ భూక్యతృ తండాకు చెందిన కొంతమంది యువకులు గుర్తించి ఆ వ్యక్తులను ఆరా తీశారు. మేము అధికారులం ఇక్కడినుండి బియ్యం లారీ వెళుతుందని సమాచారంతో ఇక్కడ నిలబడ్డాము అని సమాధానం ఇవ్వగ నిజమే అనుకున్నారు ఆ యువకులు. కానీ అడవి ప్రాంతంలో జెసిపి సహాయంతో తవ్వకాలను జరుపుతుంటే చూసి అవ్వకయ్యారు. అధికారులైతే అడివి ప్రాంతంలో జెసిబి తవ్వుతుంది అని అనుమానం ముచ్చి గట్టిగా ప్రశ్నించగా ఆ వ్యక్తులు తడబడ్డారు. ఈ విషయంపై స్థానిక అటవీ శాఖ మరియు పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేయగా అటవీశాఖ అధికారులు వచ్చేలోపు ఆ వ్యక్తులు పరారయ్యారు. అటవీ ప్రాంతంలో జరిపిన తవ్వకాలను చూసి అధికారులు షాక్ అయ్యారు ఈ తవ్వకాలు ఎందుకు చేశారో దేనికి కోసం చేశారా అనే సందిగ్ధంలో పడ్డారు. ఇది దాదాపు గుప్త నిధుల తవ్వకాలే కోసమని ఇది గుప్త నిధుల కోసం ఇచ్చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తవ్వకాలకు సంబంధించిన పూర్తి విషయాలు పూర్తి సమాచారంతో వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి.. 10 మంది మృతి

**మన దునియా,ఇంటర్నెట్ డెస్క్: ఫిబ్రవరి 22**



లెబనాన్‌లోని బెకా లోయలో నిన్న (శుక్రవారం) సాయంత్రం ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడిలో సీనియర్ హిజ్బుల్లా కమాండర్ సహా 10 మంది మృతిచెందగా.. 50మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో సాధారణ పౌరులు కూడా ఉన్నారని, గాయపడిన వారిలో చిన్నారులు ఉన్నారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024లో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ ఇలాంటి దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది. కాల్పుల విరమణ కుదిరిన తర్వాత జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటి అని లెబనాన్ ఆరోపిస్తోంది. మరోవైపు తమపై రాకెట్ దాడులకు హిజ్బుల్లా వ్యూహాలు రచిస్తోందని, అందుకే ముందస్తు దాడులు చేశామని ఇజ్రాయెల్ చెబుతోంది. ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో లెబనాన్ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి..

# సిద్దిపేట జిల్లాలో విషాదం మెడికల్ విద్యార్థిని ఆత్మహత్య

**మన దునియా,సిద్దిపేట జిల్లా:ఫిబ్రవరి 22**



సిద్ది పేట జిల్లా అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని సురభి మెడికల్ కాలేజ్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. కాలేజీలో ఫిజియోథెరపీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీజ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. మృతురాలు పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపెల్లి గ్రామానికి చెందినదని సమాచారం. హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో సహ విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు ఆమెను మృతిగా ప్రకటించారు. సమాచారం అందుకున్న సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని, చదువుల ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత కారణాల కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనతో కాలేజీ ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

# ప్రయెజనకారీగా దేవాదుల ప్రాజెక్టు,,,!!

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక!

(మొదటి పేజీ తరువాయి)



డిజిటల్ మోసాలపైన ప్రజలను అప్రమత్తం చేశారు.

**డిజిటల్ అరెస్ట్ పై ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

ప్రధానమంత్రి మన్ కి బాత్ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ గురించి మరోసారి ప్రస్థావించారు. డిజిటల్ అరెస్ట్, డిజిటల్ మోసాలపై సమాజంలో ఇప్పటికే చాలా అవగాహన వచ్చిందన్నారు. అయితే ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ మన చుట్టూ జరుగుతున్నాయన్నారు. ఇవి క్షమించరానివని, డిజిటల్ అరెస్టుకు, ఆర్థిక మోసానికి అమాయకులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమన్నారు.

కేవైసీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్న ప్రధాని మోదీ

బ్యాంకు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కేవైసీ- నో యువర్ కస్టమర్- పట్ల అప్రమత్తత అత్యంత ముఖ్యమైన అంశమని ప్రధాన మంత్రి మోదీ తెలిపారు. ఈ ప్రక్రియ అందరికీ తెలిసినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాన్నారు. బ్యాంక్ ఖాతా సురక్షితంగా ఉండేలా బ్యాంకులు ఎప్పటికప్పుడు తిరిగి- కేవైసీ నిర్వహిస్తాయన్నారు.

కేవైసీ పేరుతో సైబర్ మోసాలు .. జాగ్రత్త

ఇదే అవకాశంగా నేరస్థులు నకిలీ కాల్స్ చేస్తారని, ఎస్ ఎం ఎస్, లింకులను పంపుతారని, అలాంటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మీకు వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని, అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సందేశాన్ని గమనించి,. కేవైసీని నవీకరించుకోవాలన్నారు. కేవలం బ్యాంక్ యాప్స్ లేదా బ్రాంచ్‌ల ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

పాస్ వర్డ్స్ తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలి

ఒకే పాస్ వర్డ్ చాలా కాలం పాటు ఉంచకుండా పాస్‌వర్డ్‌లు తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలలో అప్రమత్తతే అన్నిటి కన్నా ముఖ్యమని, కనుక ప్రజలు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అప్రమత్తంగా లేకుంటే మీ కష్టార్జితం సైబర్ నేరగాళ్ళ పాలు అయ్యే ప్రమాదం ఉంటుందని ప్రధాని మోడీ హెచ్చరించారు.

## నాపై రాజకీయ కుట్ర జరుగుతోంది: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సంచలన వ్యాఖ్యలు

**మన దునియా,బెంగళూరు: ఫిబ్రవరి 22**


కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తనను రాజకీయంగా దెబ్బతీయడమే కాకుండా, తన ఉనికినే లేకుండా చేసేందుకు కొందరు కుట్ర ప్లాన్ చేస్తున్నారని ఆయన సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.

వార్తలోని ప్రధానాంశాలు:

కులం పేరుతో టార్గెట్: సోషల్ మీడియాలో తనను కులం పేరుతో లక్ష్యంగా చేసుకుంటున్నారని, ఒక సాధారణ గొర్రెల కాపరి ముఖ్యమంత్రి అయ్యాడనే కక్షతోనే తనపై ఈ దాడులు జరుగుతున్నాయని సిద్ధరామయ్య పేర్కొన్నారు.అంతం చేసేందుకు ప్లాన్: తనను అంతం చేస్తే వారి మార్గం సుగమం అవుతుందని కొందరు భావిస్తున్నారని, కేవలం తననే కాకుండా తనకు మద్దతుగా నిలిచే వ్యక్తులను కూడా అణచివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.వెనకడుగు వేసే ప్రసక్తే లేదు: రాజకీయ కుట్రలకు, అసూయ రాజకీయాలకు వ్యతిరేకంగా తన చివరి శ్వాస వరకు పోరాడుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తాను యుద్ధభూమి నుండి పారిపోయే పిరికివాడిని కాదని ధీమా వ్యక్తం చేశారు.కర్ణాటకలో ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు సాగుతోందన్న చర్చల నడుమ సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ప్రతిపక్ష నేతలు కూడా ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారని ప్రశ్నిస్తున్నారు, ఇది కన్నడ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.












**ఉమ్మడి వరంగల్,కరీంనగర్ సూర్యాపేట,యాదాద్రి, బువనగిరిలకు సాగునీరు,,,**

**ఉమ్మడి వరంగల్ జలప్రదాయ మని కితాబు**

**దేవాదుల ఇంటెల్ వెల్ గోదా వరిప్రవాహం పరశీలన**

**ఏడాది ప్రాజెక్టు పనులు పూర్తి చేసెందుకు 469మీటర్లఎత్తు నుంచి నీటిని ఎత్తిపోయడం**

**39,16 టి ఎంల నీటిని ఎడాదిలో 170 రోజుల్లొపూర్తి**

**2024,2025లో అప్పటి కాం గ్రేసు ప్రభుత్వం రు6,16కోట్లు ఇచ్చింది**

**కాలక్రమేన పనులు ఎఫ్-1,ఎఫ్-2 -ఎఫ్-3కి 13,500కోట్లిచ్చింది**

**3,26,200 ఎకరాలు లక్షం కాగ కేవలం 3268 ఎకరాలె సేకరన**

**కాగ మరో 2798 ఎకరాలకు అనుమతులు**

**తక్కువ ఖర్చుతొ ఎక్కువ పనులు చేయలని నిశ్చయం**

**కాంగ్రేసు కళల ప్రాజెక్టుగా పేరు గాంచిన చొక్కారావు**

**మన దునియా,ములుగు జిల్లా,ఫిబ్రవరి 22**

రైతులు భూములకు సాగునీటిని అందించుటకోసం నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకం ముఖ్యమంత్రి రాకతొ సాకారం అయింది, ఈప్రాక్టును అప్పట్లె కాంగ్రేసు..ప్రభుత్వమె నిర్మాణం చేపట్టింది నిధుల లేమినొ అనివార్యకారణాలతొ అగిపోయింది దీనిని ప్రయెజన కారిగా చేసెందుకు ఇప్పుడు ముఖ్యమంత్రి సంసిద్దంచేస్తున్నట్లు తెలిపారు ఆదివారం ములుగుజీల్లాలోని ఏటురునాగారం సబ్ డివిజనల్ పరిదిలోగల కన్నాయిగూడెం మండలం లొ ఉనానటువంటి దానిని సందర్సించారు,,ఈప్రాజెక్టుపనులు ఏవిధంగా ఉన్నాయి గోదావరిలో నీటిసామర్థ్యం ఎంత ఉందని పరశీలించారు ములుగు జిల్లా ముఖ్యమంత్రి ప్రాజెక్టుల వద్దకు సందర్సించడం ఇదేమొదటిసారని తెలిపారు, సి ఎం తొ పాటు మంత్రివర్గం మొత్తానికి వెంబటివచ్చారు మునుపెన్నడు కుడామంత్రులు రాలేదు, దట్టమైన అడవిప్రాంతం గుట్టలమద్యలొ ఉంది మద్యలొమైదానం చుట్టుదెగ్గరగానె గుట్టలు దీనిమద్యలొ ప్రాజెక్టు ఉంది అందరు ఆశ్చర్యపోయారు అపుడు వైస్ దీనిని ఏవిధంగా నిర్మించారు ఇంజనీర్లు ఎంతటి చాతుర్యం ఉన్నారొ అనుకున్నారు.

సి ఎం తొ పాటు మంత్రులకు ఘనస్వాగతం,,!!

దేవాదులప్రాజెక్టును పరశీలించుటకు వచ్చిన సి ఎం రేవంత్ రెడ్డి,,,డిప్యూటి సి ఎం భట్టి తోపాటుమంత్రులకు జిల్లా అధికారులు మంత్రిసీతక్క ఘనస్వాగతం పలికారు,,మొదటగా ఇన్ టాక్ వెల్ ను పరశీలించారు పదినిమిసాలు విశ్రాంతి అనంతరం పనులపరశీలన ఏ మేమి పనులు ఏమేరకు జరిగాయె ఇంజనీరింగ్ చీఫ్ దోబ్రి బచ్ మిగతా అధికారులు వివరించారు పనిముట్టు సామాగ్రి కావలసినవి అన్ని జపాన్ మలేషియా సింగపూర్ బ్రీటన్ చాలకపోతె ఇండియావి దోహదపడుతున్నాయి, ఇంజనీర్లు నివశించె ఏరియా అంతా వేడిగా ఉండటం వీల్లనివాస కుటీరానికి ఇంటెల్ వెల్ వద్దకు పర్లాంగుదూరంలోనె ఉండటం గమనార్హంగా ఉంది ఇంటెల్ వెల్ గతంలొ కంటె ఇప్పుడు పనులుసామర్థ్యం పెరిగిందని తెలిపారు.అంతెకాకుండా గోదావరిలొ ప్రస్తుతం నీటిమట్టంతక్కువగా ఉందికథా ఏలా అని అంటె పై ఎగులప్రాంతంలొ వర్షాలు కురిస్తె నీటిమట్టం పెరుగున్నారు, ప్రస్తుతానికి ప్రాజెక్టులొ నీరుసరిపోను లేదుగా పంటలసాగు తక్కువగా ఉంటుంది, కోవలు పట్టణాలకు అయితె సరిపోతుంది గ్రామాలలొ బోర్లకిందనె వ్యవసాయం నడుస్తుంది మిగిలినపనులు పూర్తయితె అనుకున్నంత నీటినిలువ అవుతుందని వివరించారు,,

ఇంజనీర్లు, మంత్రులతొ సమీక్ష,,!!

దేవాదుల ప్రాజెక్టుపనులు ఇంకా కొంచెం మిగిలి ఉన్నాయి ఏడాదిపడుతుంది వాతావరణం అనుకూలంగా లేనందువలన పనులు అప్పట్లొ కాలేదు నిధులుకూడ లేమి అయింది కిందిస్థాయి అధికారులు కూలీలు ఇబ్బందులు పడ్డారని అధికారులు తెలిపారు, నిధులను, సరిపడ ఉన్నట్లయితె మిషనరీ కూడా అందుబాటులోకి తెప్పించుకోవచ్చన్నారు, ఈవిషయంపై మంత్రులు,,సి ఎం పునరాలోచన చేసి తగువిధంగా పనులునడిసి ప్రాజెక్టు చేతికిరావాలని చర్చించారు,,మంత్రులు కెలంకసంగా ఇంజనీరింగు చీఫ్ సి ఎస్ ముఖ్యమైన ఉన్నతాధికారులతొ చర్చించారు, కావలసిన నిధులను సమకూర్చి అందుబాటులోకి ఈ ఏడాదిలోగా తేవాలని నిశ్చయించారు,,మంత్రివర్గభేటిలొ అన్నివిషయలు చర్చకువచ్చాయి, ప్రాజెక్టులను సందర్సించడం పనులను పరశీలించి మంత్రులతొ చర్సించడం ఇదిరెండావసారని అందరుహర్షం వ్యక్తంచేశారు ముఖ్యమంత్రి నేతృత్వంలొ దేవాదూలప్రాజెక్టును సందర్సించి అప్పటికాంగ్రేసు ప్రభుత్వం నిర్మించిన ఈప్రాజెక్టును కూడా బి ఆర్ ఎస్ పూర్తిచేయలేదంటె ఆశ్చర్యం కలుగుతుందన్నారు, ఈప్రాజెక్టు ఇంతదట్టమైన అడవిలొ నుంచి నీటిని కాలువలు, పైపులైన్లువేసి గుట్టలను తొలసిపట్టకెల్లడం అంతసామాన్యమైన విషయంకాదనిపిస్తుందన్నారు అప్పటి సి ఎం దివంగత నేత వై ఎస్ ఉన్నప్పుడు బారీ అండ్ మద్యతరహనీటిపారుదల మంత్రిపొన్నాల లక్ష్మయ్య పనేచేశారు ఏజెన్సీకిరాకుండా నేరుగా జనగాం పట్టణాలకు తీసుకెల్లడం జరిగింది అనంతరం ములుగుజిల్లాకు చేరుతున్నాయి ములుగు జిల్లాకేంద్రం సమీపంలొ ఇంటెల్ వెల్ నిర్మించారు మంత్రిసీతక్కపోరాటంతొ అనిహర్షం వ్యక్తంచేశారు,,

ప్రయెజనకారిగా దేవాదుల,,!

ప్రజలకు ముఖ్యంగా ములుగుజిల్లాలొ, మొదటగా ఉంటుంది ఆతర్వాత ఉమ్మడి వరంగల్ సూర్యపేట,యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఈప్రాజెక్టునీటిని అందించాలి, అంతెకాకుండా ఉమ్మడివరంగల్ జిల్లాకు జలప్రదాయమని,,కితాబు ఉందన్నారు, ఈ ఏడాదిప్రాజెక్టుపనులు పూర్తిచేస్తారు గోదావరినీటిని నదిలోనుంచి 469 మీటర్ల ఎత్తునుంచితోడి పోయాల్సి ఉంటుంది, 39,,16 టి ఎం సి నీటిని ఈ ఏడాదిలొ 170 రోజులలో పూర్తిచేయాల్సింది ఆ నీటికోసం అప్పటికాంగ్రేసు ప్రభుత్వం రూ616 కోట్లను ఇచ్చింది, నిధుల లేమివలన కాలక్రమేన పనులు అంతరించాయి, ఎఫ్-1 ,,-ఎఫ్-2,,ఎఫ్--3,,ఎఫ్--4 కాలువలపనులు నిలిచాయి 17,,500 కోట్లు ఇచ్చారు ఆ నిధులుసరిపోలేదు, 3,,26,,200 ఎకరాల భూమిని సేకరించవలసి ఉండెను, కాని 3 260 ఎకరాలె సేకరించారు ఇప్పుడు అదనంగా 2,7,980 ఎకరాలు అనుమతులు ఇచ్చామని తెలిపారు అంతెకాకుండా తక్కువ ఖర్చుతొ ఎక్కువ పనులు చేసెవిధంగా ఆధునిక టెక్నాలజిని ఉపయెగించాలని ఆదేశించారు,దేవాదులప్రాజెక్టును కాంగ్రేసు ఆళల ప్రాజెక్టుగా పిలిచేదని తెలిపారు.

మన
దునియా
Our News
Our World
RNI Number
TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం



# వరల్డ్‌కప్‌లో బిగ్ అప్‌సెట్.. నాకౌట్‌లో టీమిండియాకు షాకిచ్చిన సఫారీలు..!

పొట్టి ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా షాకిచ్చింది. ఏకపక్ష పోరులో టీమిండియాను ఒత్తిడిలో పడేసి.. 76 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇరుజట్లు ఇన్నింగ్స్ ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డాయి. కానీ, డేవిడ్ మిల్లర్(63), డెవాల్డ్ బ్రెవిస్(45)ల మెరుపులతో కోలుకున్న ప్రొటీస్ మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తీసుకుంది.. ఆపై పేసర్ల విజృంభణతో అజేయ భారత్‌కు ఓటమిని రుచి చూపించింది. భారీ ఛేదనలో టాపార్డర్ కుప్పకూలగా.. ఆపద్బాంధవుడు సూర్యకుమార్ యాదవ్(18) సైతం తేలిపోయాడు. శివం దూబే(43) ఒంటరిపోరాటం చేసినా అది సరిపోలేదు.ఐసీసీ ఈవెంట్లలో ఒత్తిడికి లోనయ్యే దక్షిణాఫ్రికా పొట్టి ప్రపంచకప్‌లో మాత్రం చెలరేగిపోతోంది. గ్రూప్ డీ నుంచి టాపర్‌గా సూపర్ 8కు దూసుకొచ్చిన సఫారీ టీమ్.. తొలి మ్యాచ్‌లో ఫేవరెట్ భారత్‌ను ఓడించింది. 188 పరుగుల చేదనలో టీమిండియాను కార్బిన్ బాస్చ్(2-12), మార్కో యాన్సెన్(4-22)లు దెబ్బకొట్టారు. తొలి ఓవర్లోనే ఓపెనర్ ఇషాన్ కిషన్(0)ను ఎడెన్ మర్క్‌రమ్ ఔట్ చేయగా.. యాన్సెన్ తొలి బంతి ఎడ్జ్ తీసుకోగా తిలక్ వర్మ(1) వికెట్ కీపర్ డికాక్ చేతికి చిక్కాడు.

### 51వద్ద ఐదో వికెట్

ఆదిలోనే రెండు వికెట్లు పడిన వేళ.. ఓపెనర్ అభిషేక్ శర్మ(15) 6, 4తో ఆశలు రేపినా.. యాన్సెన్ అతడిని బోల్తా కొట్టించాడు. 26కే వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(18), వాషింగ్టన్ సుందర్(11)లు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ద్వయాన్ని విడదీస్తూ సుందర్‌ను కార్బిన్ బాస్చ్ పెవిలియన్ చేర్చాడు. రన్‌రేటు ఒత్తిడిలో గేర్ మార్చాలనుకున్న సూర్య తేఇలికైన క్యాచ్‌తో వికెట్ ఇచ్చేశాడు. దాంతో.. 51వద్ద ఐదో వికెట్ పడింది. హార్దిక్ పాండ్యా(18), శివం దూబే(43)లకుపెద్ద షాట్లు ఆడేందుకు సఫారీలు అవకాశం ఇవ్వకపోవడంతో.. బౌండరీలు కరువయ్యాయి.మహరాజ్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన పాండ్యా బౌండరీ లైన్ వద్ద స్టబ్స్ స్టన్నింగ్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. మూడో బంతికి రింకూ సింగ్ సైతం స్టబ్స్‌కు దొరికాడు. అక్కడితో భారత ఓటమి ఖాయమైంది. ఆశ్యర్యంగా.. అర్ష్‌దీప్ కూడా పాండ్యా స్టయిల్లోనే స్టబ్స్‌కు చిక్కాడు. దూబే సిక్సర్లతో పరుగుల అంతరం తగ్గించాడంతే. దూబే, బుమ్రాలు వెంటవెంటనే ఔటవ్వగా.. 76 పరుగుల తేడాతో ప్రొటిస్ జట్టు గెలుపొందింది.

### చెలరేగిన మిల్లర్, బ్రెవిస్

సూపర్ 8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా హిట్టర్లు చెలరేగిపోయారు. పవర్ ప్లే కింగ్ బుమ్రా(3-15) టాపార్డర్‌ను కూల్చినా.. డేవిడ్ మిల్లర్(63), డెవాల్డ్ బ్రెవిస్(45) విధ్వంసక ఆటతో రెచ్చిపోయారు. 20కే మూడు వికెట్లు పడినా.. ఒత్తిడికి లోనవ్వని ఈ ద్వయం మిడిల్ ఓవర్లలో బౌండరీల మోత మోగించింది. నాలుగో వికెట్‌కు 97 రన్స్ జోడించిన ఈ జోడీ వెనుదిరిగాక.. సఫారీల స్కోర్ వేగానికి బుమ్రా, అర్ష్‌దీప్ కళ్లెం వేశారు. అయినా.. ఆఖర్లో ట్రిస్టన్ స్టబ్స్(44 నాటౌట్) దంచేయడంతో మర్క్‌రమ్ సేన7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది




# భళా అమ్మాయిలు.. ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా..!





అంతర్జాతీయ క్రికెట్‌లో భారత అమ్మాయిలు వరుసగా ట్రోఫీలు పట్టేస్తున్నారు. నిరుడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిడియా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా అవతరించగా.. రాధా యాదవ్ బృందం మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. ఓపెనర్లు విఫలమైనా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) అర్ధ శతకంతో.. రాధా యాదవ్(38) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరవగా.. ప్రేమా రావత్(3-12) ధాటికి బంగ్లా కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ టైటిల్ కొల్లగొట్టింది.సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపిన భారత ఏ జట్టు ఫైనల్లోనూ చెలరేగింది. అజేయంగా టైటిల్ పోరుకు దూసుకొచ్చిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండ్ షోతో దెబ్బతీసింది. శుభారంభం దక్కకపోయినా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రాధా యాదవ్(38) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఐదో వికెట్‌కు వీరు 69 రన్స్ జోడించి పరువు కాపాడారు. 135 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు వణికించారు.

### అటు ప్రేమ.. ఇటు తనూజ

టీమిండియా నిర్దేశించిన ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్ ఇష్మా తంజిమ్(3)ను ఔట్ చేసిన సైమా థాకొర్ వికెట్ల వేటకు తెరసింది. షమీమా సుల్తానా(20)ను వెనక్కి పంపిన ప్రేమా రావత్(3-21) ప్రత్యర్థిని మరింత దెబ్బతీసింది. రాధా యాదవ్ ఓవర్లో షర్మీన్ సుల్తానా(18) డగౌట్ చేరగా.. ప్రమాదకరమైన సదియా అక్తర్(10), లతా మొండల్(1)ను ఔట్ చేసిన ప్రేమ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. మరో ఎండ్‌లో తనూజ కన్వర్(2-11) సైతం చెలరేగగా బంగ్లా కోలుకోలేకపోయింది. షోఫియా ఖాతూన్(9)ను తనూజ ఔట్ చేయగా బంగ్లా 88 పరుగులకే ఆలౌటయ్యింది.

# కుల వివక్షకు గురైన సాకలి కుటుంబం, అగ్రకుల బలుపుకు, ప్రాణం విడిచిన 2 నెలల పసిపాప



ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతుంటే ఇండియా దేశంలో తెలంగాణలో నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మా దేవుని గుడిలోకి వస్తావా మా దేవుని దర్శించుకుంటావా సాకలి దాన అంటూ దుర్భసలాడుతూ కొట్టరానిచోట తన్నరానిచోట అనరాని మాటలు అంటూ 6 గంటల చిత్రహింసలు పెట్టి రెండు నెలల పసి గుడ్డును కసాయి కొడుకులు కాలుతో తన్నితే క్షణంలో అక్కడే ప్రాణం విడిచిన పసిబిడ్డ తనువు చాలించింది. ఇంకా కుల వివక్షత ఉందా ఇంకా కులం ఉందా అంటూ నంగనాచి కథలు చెప్పే రాజకీయ నాయకులారా ఈ ఘటన చూసైనా సిగ్గు శరం తెచ్చుకోవాలి, ఎందుకంటే ఎస్సీలను గ్రామాల్లో వివక్షత గురి చేస్తే మాకెందుకులే అనుకున్నవారు నేడు బిసి సాకలి కుటుంబానికి వివక్షత వచ్చింది. దారుణంగా చిత్రహింసలు పెట్టారు. కసాయి అగ్రకుల రెడ్డి దుర్మార్గులకు అక్కడున్నవారు ఎదురు చెప్పలేకపోయారు. న్యాయమా అన్యాయమా అని ప్రశ్నించలేకపోయారు. ముక్కుపచ్చలారని పసిగుడ్డు ఉసురు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్లో కేసు పెడితే పోలీసోడు కేసు కట్టలేదు దాడికి పాల్పడ్డ రెడ్డి అగ్రకుల దూరంకారులను ఇంకా అరెస్టు చేయలేదు, అంటే రాజ్యం ఎవరి పక్షాన ఉంది, ఎవరిది రాజ్యం, ఎవరి కోసం పని చేస్తుంది. ఈ దారుణాలు ఎంత కాలం చేస్తారు. వివక్ష పై దాడులను ఎదిరించి నిలిచేందుకు ఎవరు ముందుకు రావాలి. అగ్రకుల మనువాదుల దాడులకు ఎంతో మంది అమాయకులు ఇంకా ఎంత మంది బలి కావాలి, రాజ్యం శిక్షించకపోతే తప్పు చేసిన వారిని అరెస్టు చేయకపోతే ప్రజాస్వామ్యం ఉన్నట్టా లేకపోతే బలిసినోడికి చుట్టమైనట్టా,నేటి నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ అవమాన మానవీయ ఘటన తెలంగాణ రాజ్యమంత విశ్వవ్యాప్తంగా చేసి దాడికి పాల్పడ్డదోషులను శిక్షించేదాకా, కేసు పెట్టిన ఎఫ్ఐర్ కట్ట కుండ అరెస్టు చేయకుండా కాలయాపన చేసిన ఏ పోలీస్ ఆఫీసర్ నైనా వదిలిపెట్టకుండా సస్పెండ్ చేసి జైల్లో వేసేదాకా వామపక్షాలు, దళిత బహుజన సంఘాలు, ప్రజా సంఘాలు మానవతావాదులు, నాగర్ కర్నూలు జిల్లా దిక్కులు పిక్కటిల్లెల మరవడైన దాడి చేస్తే ఒంట్లో ఎన్నో ముక్కలు చలి పుట్టేలా ఉప్పనే కదలిరండి అంటూ పిలుపునిస్తున్నాయి, అగ్రకుల అహంకారాన్ని నడివీధిలో బట్టలిప్పి చెట్టుకు కట్టేసి పచ్చి కారం పోసి తన్ని తరిమితేనే ఇలాంటి ఘటనలు జరగవు, అంటూ ఆవేదనకు గురవుతున్నారు. ఇకనైనా చైతన్య అవుదాం ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలంతా ఏకమవుదాం, పోరాడుదాం అసమానతలు, అంతరానితనం, వివక్ష, అస్పర్శత లేని సాంప్రదాయాన్ని సంస్కృతిని విశ్వవ్యాప్తం చేద్దాం, దాడికి గురైన కుటుంబాన్ని ఆదుకుందాం అండగా ఉందాం,.... అంటూ చలో నాగర్ కర్నూల్ పోరాట రథయాత్రకు పిలుపునిస్తున్నారు.

# పరవాడ సర్కిల్‌లో సీఐపై తీవ్రమైన ఆరోపణలు

### విచారణకు డిమాండ్ చేస్తున్న బాధితులు



**మన దునియా,విశాఖ ఉమ్మడి: ఫిబ్రవరి 22**



అనకాపల్లి జిల్లా పరవాడ పోలీస్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అయినటువంటి మల్లికార్జునపై బాధితులు నుంచి తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వారిపై దౌర్జన్యాలు తప్పుడు కేసులు బనాయింపులు అధికారం మద్యంతో కాలర్ ఎగరేస్తున్న మల్లికార్జున పేద ప్రజలపై పెత్తనం చెలాయింపు "మామూలు" పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే తప్పుడు కేసులు నమోదు చేసి చేస్తున్నారని తీవ్ర బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు చెబుతున్నారు.బాధితులు వాదన ప్రకారం, పరవాడ ప్రాంతంలో ఉన్న ఫార్మా కంపెనీలు, ఎన్టిపిసి సంబంధిత రవాణా లారీలు, గ్రావెల్ గనులు వంటి రంగాల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. బెల్ట్ షాపులు, అనుమతి లేని దాబాలు, ఇతర వ్యాపారాల నుంచి కూడా వాటాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో బినామీ పేర్లతో లావాదేవీలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఇంకా, ప్రభుత్వ భూముల విషయంలో రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమాలు కూడా ఉన్నాయని బాధ్యతలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై మల్లికార్జున పైన పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఇచ్చినా ఇప్పటివరకు స్పష్టమైన విచారణ జరగలేదని బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈయన పైన ఉన్నటువంటి అధికారులు సబ్ డివిజనల్ ఆఫీస్ పోలీస్ డిఎస్పి సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ జిల్లా ఎస్పీ అలాగే రేంజ్ డిఐజి హెడ్ క్వార్టర్ అయినటువంటి డిసిపి మరియు హోం శాఖ మంత్రి అధికారికి అలాగే ప్రభుత్వ అధికారులకు కూడా లికిత పూర్వక లేక ద్వారా పంపించడం జరిగింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం తప్పుడుగా ప్రచారం చేసి తిరిగి తప్పుడుగా తిరస్కారం చేసి అధికారులని మబ్బుపరుచుతున్నా పరవాడ సీఐ మల్లికార్జున ఇప్పటికైనా ఈయనపై స్పెషల్ కమిషన్ వేసి నిజానిజాలు వెలికి తీయాలని స్వతంత్ర విచారణ కమిటీ నియమించాలని బాధ్యతలు కన్నీరుతో ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మన దునియా
Our News Our World
RNI Number
TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం




## 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్'... పెళ్లిని అధికారికంగా ప్రకటించిన విజయ్ దేవరకొండ, రష్మిక

అభిమానులు సృష్టించిన 'విరోష్' అనే పేరును పెళ్లికి ఖరారు చేసిన వైనంఈ పేరును అభిమానులకు అంకితమిస్తున్నట్టు సోషల్ మీడియాలో వెల్లడి తమ బంధానికి అభిమానులే అర్థం ఇచ్చారంటూ భావోద్వేగ పోస్ట్ ఫిబ్రవరి 26న పెళ్లి, మార్చి 4న రిసెప్షన్ అంటూ ప్రచారంలో ఉన్న వెడ్డింగ్ కార్డ్ టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి కబురును అధికారికంగా ప్రకటించారు. ఎంతో కాలంగా వీరిద్దరి వివాహంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తమ పెళ్లి వేడుకకు 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెట్టినట్టు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ పేరును తమ అభిమానుల గౌరవార్థం పెట్టినట్టు చెప్పి వారికి ప్రత్యేకమైన గౌరవాన్ని ఇచ్చారు.తమ వివాహానికి ఈ పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని ఈ జంట వివరించింది. 'విరోష్' (ఎ×=రూాఎ) అనే పేరును ఏ వెడ్డింగ్ ప్లానర్లు, కుటుంబ సభ్యులు సూచించలేదని, ఎన్నో ఏళ్ల క్రితం తమ అభిమానులు ప్రేమతో సృష్టించినదేనని తెలిపారు. తాము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, అభిమానులు తమ బంధానికి ఓ అర్థం ఇచ్చారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఓ ఉద్వేగభరితమైన నోట్‌ను పంచుకున్నారు. "మా ప్రియమైన వారికి, మేము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, మా కోసం మేము ఏదీ ఎంచుకోకముందే.. మీరు అప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చేశారు. ఎంతో ప్రేమతో, మీరు మాకు ఒక పేరు ఇచ్చారు. మమ్మల్ని 'విరోష్' అని పిలిచారు. కాబట్టి ఈ రోజు నిండు మనసుతో, మా ఈ కలయికకు మీ గౌరవార్థం 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెడుతున్నాం. మమ్మల్ని ఇంతగా ప్రేమించినందుకు ధన్యవాదాలు. మీరు ఎప్పటికీ మాలో భాగమే!" అని రాసుకొచ్చారు.ఇదిలా ఉండగా, ఇటీవలే విజయ్, రష్మికల పెళ్లి పత్రిక అంటూ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ పత్రిక ప్రకారం, ఈ జంట ఫిబ్రవరి 26న ఒక చిన్న, సన్నిహిత వేడుకలో వివాహం చేసుకోనున్నారు. ఆ తర్వాత మార్చి 4న హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ జరగనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

## రిషబ్ శెట్టి-ప్రశాంత్ వర్మ కాంబోలో 'జై హనుమాన్' ప్రారంభం

'హనుమాన్' సీక్వెల్ 'జై హనుమాన్' షూటింగ్ ప్రారంభం హనుమంతుడి పాత్రలో 'కాంతార' ఫేమ్ రిషభ్ శెట్టి ఆంజనేయుడి జన్మస్థలం అంజనాద్రిలో పూజా కార్యక్రమాలు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం తేజా సజ్జాతో పాటు పలువురు సినీ ప్రముఖుల హాజరు 'హనుమాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్‌లోని తదుపరి చిత్రం 'జై హనుమాన్'ను అధికారికంగా ప్రారంభించారు. కర్ణాటకలోని హంపి సమీపంలో, ఆంజనేయుడి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన అంజనాద్రి బెట్టపై పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా మొదలైంది. ఈ చిత్రంలో హనుమంతుడి కీలక పాత్రను 'కాంతార' ఫేమ్, జాతీయ అవార్డు గ్రహీత రిషభ్ శెట్టి పోషిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రిషభ్ శెట్టి తన భార్య ప్రగతి శెట్టితో కలిసి హాజరయ్యారు. 'హనుమాన్' హీరో తేజా సజ్జా, దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాతలు పాల్గొన్నారు. ముహూర్తపు షాట్‌కు ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ క్లాప్ కొట్టగా, అనిల్ థడానీ కెమెరా స్విచాన్ చేశారు. స్క్రిప్ట్ అందుకున్న సమయంలో రిషభ్ శెట్టి భక్తిభావంతో కనిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పిస్తోంది. 2024 సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'హనుమాన్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికత, గ్రాఫిక్స్‌తో భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు. గౌర హరి సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.






## సమంత 'మా ఇంటి బంగారం' వచ్చేది అప్పుడే!

సమంత నటిస్తున్న 'మా ఇంటి బంగారం'రిలీజ్ డేట్ ఖరారు ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న చిత్రం కొత్త పోస్టర్‌తో సోషల్ మీడియా ద్వారా తేదీని ప్రకటించిన సమంత ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్న సమంతనందిని రెడ్డి దర్శకత్వంలో సినిమా ప్రముఖ నటి సమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఖరారైంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని సమంత స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కొత్త పోస్టర్‌లో సమంత ఓ తలుపు చాటు నుంచి ఆసక్తిగా తొంగిచూస్తూ కనిపించారు. ఈ పోస్టర్‌ను పంచుకుంటూ, "ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం, బంగారాలు.. మే 15న 'మా ఇంటి బంగారం'ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలవుతోంది" అని ఆమె క్యాప్షన్ జోడించారు. నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను జనవరిలో విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. బస్సులో బ్రౌన్ కలర్ చీరలో నిలబడి, పోరాటానికి సిద్ధమైనట్లుగా ఉన్న సమంత లుక్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా గురించి సమంత మాట్లాడుతూ, "ఇది కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చే ఎమోషనల్ కథ. ఒక మహిళ బలం ఆమె ధైర్యం నుంచే కాదు, బలహీనత నుంచి కూడా వస్తుందని ఈ చిత్రం చెబుతుంది. ఈ పాత్రలో నటించడం, నిర్మాతగా ఈ సినిమాను నిర్మించడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది" అని తెలిపారు. సరదాగా, ఉత్కంఠగా సాగే ఈ కథ ప్రేక్షకులకు తప్పకుండా కనెక్ట్ అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com